

52 మద్యం షాపులకు 174 దరఖాస్తులు

పార్వతీపురం, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీలో భాగంగా జిల్లాలోని 52 మద్యం షాపులకు ఇప్పటివరకు 174 దరఖాస్తులు అందాయని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన కిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా మూడు రోజులే గడువు ఉన్నందున ముమ్మర ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. పార్వతీపురం, సీతానగరం, సాలూరు, కురుపాం, పాలకొండ ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్లలో ఈ నెల తొమ్మిదో తేదీలోగా రూ.2 లక్షలు రుసుం చెల్లించి దరఖాస్తులు అందజేయొచ్చని చెప్పారు. 11న కలెక్టర్ సమక్షంలో డ్రా తీసి షాపులను కేటాయిస్తామన్నారు.

గిరిజన గ్రామాలకు మహర్దశ


పీఎం జుగా పథకం కింద ఎంపికైన జగతిపల్లి గ్రామం

- పీఎం జుగాతో 25 రకాల అభివృద్ధి పనులు
- జిల్లాలో 868 గ్రామాలు ఎంపిక
- మౌలిక వసతులు, ఉపాధి కల్పనకు పెద్దపీట
- మారనున్న రూపురేఖలు
- పరిష్కారం కానున్న గిరిపుత్రుల సమస్యలు

పార్వతీపురం, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి)

ప్రధానమంత్రి జన్‌జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ పథకంతో గిరిజన గ్రామాలకు మహర్దశ పట్టనుంది. వాటి రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. గడిచిన కొన్నేళ్లుగా కనీస ప్రగతికి నోచుకోని గ్రామాలు అభివృద్ధి బాట పట్టనున్నాయి. ఈ పథకం కింద ఇప్పటికే పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలోని 12 మండలాల్లో 165 పీవీటీజీ గ్రామాలను ఎంపిక చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఆయా గ్రామాల పరిధిలో ఉన్న 43,154 కుటుంబాల్లో అర్హులకు ఉపాధి కల్పించనున్నారు. ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించనున్నారు. మైదాన ప్రాంతాల్లో 50 మంది గిరిజనులు ఉన్న 703 గ్రామాలను అభివృద్ధి చేయనున్నారు. మొత్తంగా రెండు ఐటీడీఏల పరిధిలోని 868 గిరిజన గ్రామాల్లో ప్రజల సమస్యలు పరిష్కారం కానున్నాయి.

మౌలిక సౌకర్యాల కల్పన ఇలా..

సొంతిల్లు లేని వారికి పక్కా ఇళ్ల మంజూరుతో పాటు నిర్మాణానికి సంబంధించి ఆర్థిక సాయం అందించనున్నారు. ఆయా గ్రామాల్లో రహదారులు మరమ్మతు పనులు చేపట్టనున్నారు. ప్రతి ఇంటికి కొళాయిలు ఏర్పాటు చేసి తాగునీటి సదుపాయం కల్పించనున్నారు. విద్యుత్ సరఫరాలో ఎక్కడైనా లోపాలు ఉంటే సరిచేయనున్నారు. సౌర వెలుగులకు అవసరమైన పరికరాలను పంపిణీ చేయనున్నారు. పూర్తిస్థాయిలో మెరుగైన వైద్యసేవలు అందించనున్నారు. ఆయుష్మాన్‌భవ కార్డులు జారీ చేయనున్నారు. గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు లేని చోట ఏర్పాటు చేయనున్నారు. ప్రతిఒక్కరికీ పౌష్టికాహారం అందేవిధంగా చర్యలు తీసుకోనున్నారు. అవసరమైన ప్రాంతాల్లో వసతిగృహాలు ఏర్పాటు చేయనున్నారు. నిరుద్యోగ గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఏజెన్సీలో టెలికాం డిజిటల్ సేవలు విస్తరణ, మార్కెటింగ్‌పై అవగాహన, రైతులు, పశు పోషకాలు, మత్స్యకారులు ఆర్థిక అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. ఇందుకోసం పలు పథకాలు అమలు చేయనున్నారు. సబ్సిడీపై రుణాలు అందించనున్నారు.

సీతంపేట పరిధిలో..

సీతంపేట రూరల్: పీఎం జుగా పథకం కింద పాలకొండ నియోజకవర్గంలో 54 గిరిజన రెవెన్యూ గ్రామాలు ఎంపికయ్యాయి. అయితే అధిక శాతం గిరిజన జనాభా కలిగిన సీతంపేటకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ మండలంలో 32 రెవెన్యూ గ్రామాలు ఎంపికవగా.. ఆయా చోట్ల అన్ని శాఖల సమన్వయంతో ఈ ఏడాది నవంబరు నుంచే 25 రకాల అభివృద్ధి పనులను చేపట్టనున్నారు.

రహదారులకు నిధుల కేటాయింపు...

గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం, మక్కువ, సీతంపేట మండలాల్లో పలుచోట్ల రహదారుల నిర్మాణాలకు సుమారు రూ.56 కోట్లు మంజూరయ్యాయి. కాగా కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం చొప్పున నిధులు కేటాయించనున్నాయి. త్వరలో ఈ పనులను ప్రారంభించనున్నారు.

పీవో ఏమన్నారంటే...

'పీఎం జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ పథకం కింద సీతంపేట ఐటీడీఏ పరిధిలో 32 రెవెన్యూ గ్రామాలు ఎంపికయ్యాయి. వాటికి అనుకున్న ఆవాస గిరిజన గ్రామాల్లో కూడా అభివృద్ధి పనులు చేపడతాం. కేంద్రం ప్రకటించిన 25 అభివృద్ధి పథకాల్లో కొన్నింటికి రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వరకు నిధులు కేటాయించనుంది'. అని సీతంపేట ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి తెలిపారు.


మండగూడలో రహదారి ఇలా..


సీతంపేట మండలంలో మండ గ్రామం


ఘటాలతో ఊరేగింపుగా కోటదుర్గమ్మ ఆలయానికి వెళ్తున్న భక్తులు

మిన్నంటిన సంబరాలు

- కోటదుర్గమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

పాలకొండ: కోటదుర్గమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. పట్టణంలో పలు వీధులకు చెందిన ప్రజలు కోలాటాలు, డప్పువాయిద్యాలు, ముగ్రాటలు, ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి కోటదుర్గమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. మహిళా భక్తులు కుంకుమ పూజలు చేపట్టారు. మొత్తంగా సంబరాలతో పాలకొండ పట్టణం హోరెత్తింది. బంధువులు, స్నేహితులు దూర ప్రాంతాల నుంచి రావడంతో పాలకొండ కిక్కిరిసింది. ఇదిలా ఉండగా అమ్మవారిని దర్శించడానికి పాలకొండతో పాటు విజయనగరం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఒడిశా రాష్ట్రం నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయంలో క్యూలైన్లన్నీ కిక్కిరిశాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ చంద్రమౌళి, ఎస్ఐ ప్రయోగమూర్తి బందోబస్తు నిర్వహించారు. ఈవో వీవీ సూర్యనారాయణ, అర్చకుడు లక్ష్మీ ప్రసాదశర్మ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కోటదుర్గమ్మ ఆలయ చైర్మన్ కొండలరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు జి.సంతోష్, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

ఇసుక సరఫరా ప్రారంభం

- కాట్రగడ-బి వద్ద స్టాక్ పాయింట్
- కలెక్టర్, ఎస్పీ వెల్లడి

పార్వతీపురం, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భామిని మండలం కాట్రగడ-బీ వద్ద స్టాక్ పాయింట్ నుంచి ఇసుక సరఫరా ప్రారంభమైందని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు తావు లేకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ప్రజలకు ఉచితంగా ఇసుకను అందించనున్నామన్నారు. రీచ్ నుంచి దూరం, వాహన సామర్థ్యం అనుసరించి ధరలు నిర్ణయించినట్టు తెలిపారు. మెట్రిక్ టన్ను ఇసుక ఉత్పత్తికి రూ.270 వరకు వ్యయమవుతుందని వెల్లడించారు. ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకున్న వారికి తొలి ప్రాధాన్యం ఉంటుందన్నారు. భామిని మండలం నేరడిలో వెయ్యి మెట్రిక్ టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. 12 లారీలు, రెండు ఎక్స్‌కవేటర్లు, రెండు ట్రాక్టర్లు సీజ్ చేశామని, రూ.4 లక్షల వరకు జరిమానా విధించామని చెప్పారు. పాలకొండ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదు చేసినట్టు వివరించారు.



పండగకు రారండహో

- సిరిమానోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు
- సంప్రదాయబద్ధంగా చాటింపు పూర్తి


పైడిమాంబ సిరిమానోత్సవ చాటింపు



(విజయనగరం రూరల్)

నడిచే దేవతగా పేరొందిన పైడిమాంబ సిరిమానోత్స వానికి సమయం సమీపిస్తోంది. ఆలయ అధికారులు, జిల్లా యంత్రాంగం శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. సిరిమానోత్సవ ఘట్టాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మధ్యాహ్నం 3 గంటలకే ప్రారంభించి.. సాయంత్రం 5 నుంచి 5.30 గంటల మధ్య పూర్తి చేయాలనుకుంటున్నారు. పైడిమాంబ పరివారంగా భావించే అంజలిరథం, బెత్సవారి వల, పాలధార, ఇతర రథాలను కూడా వేగంగా కదిలించాలని నిర్ణయించారు. పోలీసులకు ఆ బాధ్యతలు అప్పగించారు. సిరిమానుకు పూజలు నిర్వహించి పురోహితులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం పూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమాను పీఠం అధిరోహిస్తారు. ప్రధాన సిరిమాను రథం హుకుంపేట నుంచి వేగంగా చదురుగుడికి చేర్చగలిగితే నిర్దేశించిన సమయంలో గానే సిరిమాను ఊరేగింపు ప్రారంభమవుతుంది. ఇదిలా ఉండగా పైడిమాంబ సిరిమానోత్సవ చాటింపు ప్రక్రియ ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు చదురుగుడి వద్ద సంప్రదాయబద్ధంగా జరిగింది. ఆలయ తలయారీ చిన పైడిరాజు ఆధ్వర్యంలో డప్పు కళాకారులు సిరిమానోత్సవ చాటింపు నిర్వహించారు. తొలుత చదురుగుడిలో అనంతరం చదురుగుడి బయట ఆ తరువాత డప్పులు వాయిస్తూ కోట వరకూ వెళ్లి చాటింపు ప్రక్రియను కొనసాగించారు.

ఏర్పాట్లు వేగవంతం చేయండి

పైడిమాంబ సిరిమానోత్సవ ఏర్పాట్లు వేగవంతం చేయాలని దేవదాయశాఖ రాష్ట్ర అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్ చెప్పారు. ఆదివారం చదురుగుడికి వచ్చారు. సిరిమానోత్సవ ఏర్పాట్లపై దేవదాయశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్లు, చలువ పందిళ్లు, షామియానాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయక పోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పండగ సమీపిస్తున్న నేపథ్యంలో వెంటనే ఏర్పాటు చేయకపోతే లక్షలాది మంది భక్తులకు ఏ విధంగా సౌకర్యాలు కల్పిస్తారని అధికారులను ప్రశ్నించారు.



పెళ్లి సందడి

- జిల్లాలో మొదలైన శుభకార్యాలు
- మార్చి 16 వరకు మంచి ముహూర్తాలు

కొమరాడ: జిల్లాలో వివాహాల సందడి మొదలైంది. ఆశ్వయుజ మాసంతో పాటు కార్తీక, మార్గశిర, మాఘ మాసాలలో బలమైన ముహూర్తాలు ఉండడంతో జిల్లావాసులు శుభకార్యాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, భూమి పూజ, నిశ్చయ తాంబూలాలు వంటి వాటికి సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే చాలామంది కల్యాణ మండపాలను బుక్ చేసుకున్నారు. మరోవైపు పురోహితులు, వంటల తయారీదారులు, షామియానాలు సమకూర్చేవారు, ఫొటో, వీడియో గ్రాఫర్లు, లైటింగ్, పూల అలంకరణ చేసేవారు, మంగళ వాయిద్యాలు, ఆభరణాల తయారీదారులు, ఐస్ క్రీమ్ పార్లర్లు, కూరగాయల సరఫరాదారులకు డిమాండ్ పెరిగింది. గతంతో పోలిస్తే అన్ని ధరలు పెరగడంతో శుభకార్యాలు చేసే వారి బడ్జెట్ 20 నుంచి 40 శాతం వరకు పెరిగింది. ఏదేమైనా శుభ కార్యాల కారణంగా జిల్లాలో అనేకమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.



శుభ ముహూర్తాలు ఇవీ..

- ఈ నెలలో 26వ తేదీ వరకు
- నవంబరు 3 నుంచి 24 వరకు
- డిసెంబరు 4 నుంచి 8వ తేదీ వరకు
- వచ్చే ఏడాది జనవరి 30 నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకు
- మార్చి 2 నుంచి 16వ తేదీ వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయి.

శుభ కార్యాలు చేయొచ్చు..

గత కొద్ది నెలలుగా మంచి ముహూర్తాలు లేక శుభకార్యాలు జరగలేదు. ఆశ్వయుజ మాసం ప్రారంభ కావడంతో ఈ నెల నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు వివాహాలు, గృహ ప్రవేశాలు వంటివి చేసుకోవచ్చు.

\- పి.గోపీశర్మ, జ్యోతిషుడు, కొమరాడ

2 నెలలుగా.. అందట్లే..



- వేతనాల కోసం సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది ఎదురు చూపు
- కేజీబీవీలకూ నిలిచిన డైట్ బిల్లులు
- ఉన్నతాధికారులు స్పందించాలని విన్నపం

గరుగుబిల్లి: జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి గత రెండు నెలలుగా జీతాలు అందడం లేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణకు నానా అవస్థలు పడుతున్నారు. మరోవైపు దసరాకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో పండగ ఎలా జరుపుకోవాలో తెలియక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వాస్తవంగా జిల్లాలోని 15 మండలాల పరిధిలో 110 మంది సీఆర్‌పీలు, 15 మంది ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, 15 మంది ఎల్‌డీఏలు, 15 మంది మెసెంజర్లు, వీరితో పాటు 247 మంది కేజీబీవీల సిబ్బంది, మరో 184 మందికి పైగా పార్ట్ టైమ్ ఉద్యోగులు ఉన్నారు. మొత్తంగా ఆరు వందల మందికి పైబడి విధులు నిర్వహిస్తున్నారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న వారంతా వేతనాల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం అప్పులతోనే బతుకు బండిని లాక్కొస్తున్న వారు దసరా పండగ నేపథ్యంలో తమపై కరుణ చూపాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా 'మన్యం'లోని 15 కేజీబీవీలకు గత రెండు నెలలుగా డైట్ బిల్లులు మంజూరు కావడం లేదు. దీంతో భోజన నిర్వాహకులకు ఇక్కట్లు తప్పడం లేదు.

'సమగ్ర శిక్ష అభి యాన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమస్యలను అమరావతిలోని ఫైనాన్స్ విభాగం దృష్టికి తీసుకువెళ్లాం.. ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి బడ్జెట్ రావాల్సి ఉంది. బడ్జెట్ సమస్య కారణంగానే కేజీబీవీలకు కూడా డైట్ బిల్లులు మంజూరు కాలేదు. నిధులు మంజూరు కాగానే సమగ్ర శిక్ష సిబ్బందితో పాటు కేజీబీవీలకు చెల్లింపులు చేస్తాం.' అని డీఈవో జి.పగడాలమ్మ తెలిపారు.


రావివలస కేజీబీవీ

మరమ్మతులు లేక.. రాకపోకలు సాగించలేక

- అధ్వానంగా గరుగుబిల్లి ప్రధాన రహదారి
- నరకం చూస్తున్న వాహనదారులు

గరుగుబిల్లి: పార్వతీపురం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే ప్రధాన రహదారి మార్గంలో ఇబ్బందులు తప్పేదెప్పుడోనని స్థానికులు ఆశగా ఎదురు చూస్తున్నారు. గత కొద్ది నెలలుగా రహదారి మార్గం అడుగడుగునా గోతులమయం కావడంతో ప్రయాణికులు, వాహనదారులు రహదారి నరకం చూస్తున్నారు. పార్వతీపురం నుంచి సంతోషపురం వరకు గోతులను పూడ్చేందుకు ప్రభుత్వం రూ.55లక్షలు నిధులు మంజూరు చేసింది. మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలబారిన పడాల్సి వస్తోంది. ఇటీవల అడ్డాపుశీల సమీపంలోని భారీ గోతుల్లో ఆటో దిగబడటంతో ప్రయాణికులు పలు అవస్థలను ఎదుర్కొన్నారు. చెరువును తలపిస్తున్న గోతుల్లో ఆటో కూరుకుపోవడంతో బయటకు తీసేందుకు ప్రయాసపడ్డారు. అలాగే ఉల్లిభద్ర సమీపంలోని తోటపల్లి కుడి ప్రధాన కాలువ సమీపంలో ఇటీవల గొల్లవానివలసకు చెందిన కోంద్రు గిరీష్ ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఎదురుగా వస్తున్న భారీ వాహనాల లైటింగ్ కారణంగా గోతిలో పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈయనకు తలకు, కాలుకు బలమైన గాయాలు కావడంతో పార్వతీపురం కేంద్రాసుపత్రికి తరలించారు. ప్రధానంగా ఈ మార్గంలో నిత్యం వాహనాలు మరమ్మతులతో పాటు వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ప్రమాదాలు నెలకొం టున్నా అధికారుల్లో స్పందన లేదని, వీరి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి రహదారి మరమ్మతులకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అధికారులు స్పందించకుంటే ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశాలు ఉన్నాయి.


అడ్డాపుశీల ప్రాంతంలో గోతిలో దిగబడిన ఆటోని నెడుతున్న ప్రయాణికులు(ఫైల్)


కొమరాడ: అంతర్ రాష్ట్ర రహదారి గోతిలో నిలిచిన లారీ

గోతిలో నిలిచిన లారీ.. స్తంభించిన ట్రాఫిక్

కొమరాడ: అంతర్ రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతుల కారణంగా వాహన చోదకులకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. కొమరాడ కాలేజీ జంక్షన్‌కు సమీపంలో రహదారిపై ఏర్పడిన గోతిలో ఒడిశా నుంచి విశాఖపట్నం వెళుతున్న లారీ ఆదివారం నిలిచిపోయింది. దీంతో అంతర్ రాష్ట్ర రహదారిపై సుమారు నాలుగు గంటలకు పైగా రాకపోకలు ఆగిపోయాయి. వందలాది భారీ వాహనాలు ఇరువైపులా నిలిచిపోయాయి. వెంటనే పోలీసులు వచ్చి గోతిలో దిగబడిపోయిన లారీని జేసీబీ సహాయంతో పక్కకు తీశారు. అనంతరం వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

గొయ్యి ఉంది జాగ్రత్త!

సాలూరు రూరల్: బూర్జి జంక్షన్ నుంచి మావుడి వెళ్లే దారిలో రోడ్డుపై పెద్ద గొయ్యి ఏర్పడింది. ఈ గొయ్యి వద్ద వాహనాదారులకు ఇబ్బందులు పడకుండా స్థానికులు అందులో ముళ్లకంపను వేశారు. ఈ ప్రమాదకరమైన గొయ్యిని కప్పితే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు.


మావుడి రోడ్డులో గొయ్యి ఉందనే సూచించే ముళ్లకంప

అంగన్‌వాడీల హామీలు నెరవేర్చాలి

సాలూరు రూరల్: మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం.ఉమామహేశ్వరి డిమాండ్ చేశారు. ఆదివారం సాలూరులోని సీపీఎం కార్యాలయంలో ఆమె ఆధ్వర్యంలో మినీ అంగన్‌వాడీ వర్కర్స్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లగా మార్చాలని, వారి వేతనాలను పెంచాలని కోరారు. అర్హత బట్టి సామాజిక పింఛన్లు, ఇళ్లు, గ్యాస్, సున్నా వడ్డీ రుణాలు, నెలవారి మొత్తం తదితర వాటిని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు అందించాలన్నారు. ఈ సమావేశానికి ముందు సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్‌వై నాయుడు, మినీ అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఉత్తరమ్మ, రామలక్ష్మి, పార్వతి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాత్రి పూటయినా త్రీఫేజ్ విద్యుత్ ఇవ్వండి

సాలూరు రూరల్: రాత్రి పూటయినా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని మరిపిల్లి, తోణాం తదితర ప్రాంతాల రైతులు కోరుతున్నారు. గత కొద్దిరోజులుగా ఆయా ప్రాంతాల్లో ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది వ్యవసాయ, ఇళ్లకు సరఫరా అయ్యే విద్యుత్ బైఫిరికేషన్ పనులు చేస్తున్నారు. ఈనేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటలకు సాగునీరు అందించలేక పోతున్నామని రైతులు వాపోతున్నారు. పగటి పూట విద్యుత్ పనులు జరుగుతున్నందున రాత్రి పూట సరఫరా ఉంటే పంటలకు సాగునీరు అందించగలమని రైతులు కోరుతున్నారు.

పూర్తి స్థాయిలో సరఫరా చేస్తాం

ఈ విషయమై ఏపీఈపీడీసీఎస్ డీఈ గోపాలరావునాయుడు దృష్టికి తీసుకెళ్లగా పనులు జరిగే ప్రాంతంలో మాత్రమే విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పారు. పనులు పూర్తి చేసిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. సరఫరాలో స్వింగ్ ఉండడంతో సమస్య ఏర్పడుతుందన్నారు. రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి


పెద్దింపేటలో సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

బలిజిపేట: పెద్దింపేట గ్రామంలో ఆదివారం సీపీఎం మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ సభ్యుడు నారు సాంబమూర్తి సీపీఎం జెండాను ఆవిష్కరించారు. అనంతరం సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా సాంబమూర్తి, సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ కేంద్రం బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ఆలోచన చేయడం లేదన్నారు. లడ్డూపై రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. పెద్దింపేట పంచాయతీలో మంచినీరు, సాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యలపై దృష్టిపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు యామల మన్మథరావు, గౌరీశ్వరరావు, సత్యం, కృష్ణ, రామారావు పాల్గొన్నారు.

నడకతోనే ఆరోగ్యం


మాట్లాడుతున్న వాకర్స్ గవర్నర్ స్వామినాయుడు

పార్వతీపురంటౌన్: నడకతోనే ఆరోగ్యంగా జీవించవచ్చునని వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ స్వామినాయుడు అన్నారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నడక, నడత అనే అంశంపై మార్నింగ్ స్టార్ వాకర్స్ క్లబ్ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని జయించేందుకు నడక తప్పనిసరి అన్నారు. అనంతరం ఈనెల 27 తేదీన వాకర్స్ ఇంటర్నేషనల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతూ బ్రోచర్‌ను విడుదల చేశారు.

ఐకమత్యమే బలం

- రాష్ట్ర ఆర్యవైశ్య మహా సభ అధ్యక్షుడు సత్యనారాయణ

పార్వతీపురం టౌన్: ఐకమత్యమే మన బలమని రాష్ట్ర ఆర్యవైశ్య మహా సభ అధ్యక్షుడు చిన్ని సత్యనారాయణ అన్నారు. ఆర్యవైశ్య సంఘ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం పార్వతీపురం పట్టణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సభలో ఆయన మాట్లాడారు. అమరావతిలోని అసెంబ్లీ ఆవరణలో పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎన్డీఏ ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఆర్యవైశ్యుల్లో చిన్న చిన్న వ్యాపారులకు రాష్ట్ర ప్రభుత్వం వడ్డీలేని రుణాలను మంజూరు చేయాలని కోరారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

జిల్లా ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మమ్ముల విశ్వేశ్వరరావు, కోట సుబ్రహ్మణ్యం, కోశాధికారి పసుమర్తి శేషు, ఉపాధ్యక్షుడు గ్రంధి శ్రీనివాసరావు(నాని)లతో రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆడబడి వీధిలో గల శ్రీ కన్యాకా పరమేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర సీనియర్ నాయకుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి అద్దా గోవిందరావు, ఆర్యవైశ్య మహసభ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.వేంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు టి.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో పూజలు చేస్తున్న ఆర్య వైశ్య సంఘ నూతన కార్యవర్గ సభ్యులు

రక్తదానంతో ప్రాణదానం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న సభ్యులు

ఒడిశా

రాయగడ: రక్తదానం ఆపదలో ఉన్న ఓ నిండు ప్రాణానికి ఊపిరి పోస్తుందని విశ్రాంత ప్రభుత్వ వైద్యాధికారి వి.లోకనాథ్ రాజు అన్నారు. ఆదివారం స్థానిక బాలాజీ వేంకటేశ్వర ఆలయ కల్యాణ మండపంలో మహిళా వాకర్స్ క్లబ్, యూత్ వాకర్స్‌క్లబ్ సభ్యులు నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో మొత్తం 24 యూనిట్ల రక్తం సేకరించినట్లు ప్రభుత్వ వైద్యుడు గౌతమ్‌పట్నాయక్ తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకుడు డీకే మహంతి, బీజేపీ నాయకుడు కిషోర్‌చంద్ర పండా, మహిళా వాకర్స్ క్లబ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు కె.రజిత, కె.భారతి, బి.లక్ష్మిలు, యూత్ వాకర్స్‌క్లబ్ నుంచి అధ్యక్షుడు కె.వంశీ కిరీటి, కార్యదర్శి బి.అవంతి కోశాధికారి భాష పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు కురుపాం విద్యార్థిని

కురుపాం: అనంతపురంలో జరగనున్న రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కె.శరణ్య ఎంపికయ్యింది. విజయనగరం రాజీవ్ గాంధీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి కృష్ణంరాజు ఆధ్వర్యంలో జరిగిన అండర్-14 విభాగంలో జిల్లా స్థాయి పోటీలలో అర్హత సాధించిన శరణ్య రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు కరాటే కోచ్ కోటక నరేష్ తెలిపారు. ఈసందర్భంగా శరణ్యకు గ్రామస్థులు అభినందించారు.


శరణ్యతో కోచ్

ట్రైకర్ బోర్డు మెంబర్‌కు ఘన స్వాగతం

కురుపాం: రాష్ట్ర ట్రైకర్ బోర్డు మెంబర్‌గా పువ్వల లావణ్య విజయవాడలో పదవీ బాధ్యతలు చేపట్టి స్వగ్రామమైన పాత కురుపాం ఆదివారం వచ్చిన సందర్భంగా నియోజకవర్గానికి చెందిన గిరిజన నాయకులు, టీడీపీ నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ర్యాలీగా తీసుకువచ్చారు. ఈసందర్భంగా లావణ్య మాట్లాడుతూ పార్టీ ఆదేశాలు తూచా తప్పకుండా పాటిస్తూ తన పదవికి న్యాయం చేస్తాని అన్నారు.


లావణ్యకు స్వాగతం పలుకుతున్న గిరిజన మహిళలు

నఖ చిత్రకారుడికి సన్మానం

గరుగుబిల్లి: నాగూరులో ప్రముఖ నఖ చిత్రకారుడు పల్ల పరిశినాయుడు మాస్టారుకు ఆదివారం ఘనంగా సన్మానించారు. విశాఖపట్టణానికి చెందిన నార్త్ కోస్ట్ కార్టూన్ ఫోరం ప్రతినిధులు నాగూరు వచ్చి ఆయన్ని దుశ్శాలువాతో సన్మానించారు. సాహితీవేత్త గంటేడ గౌరునాయుడు, రచయిత సీహెచ్ గోపాలరావు, కార్టూనిస్టు పి.రోహిణికుమార్ పాల్గొన్నారు.


పరిశినాయుడును సన్మానిస్తున్న దృశ్యం

తుఫాన్ బాధితులకు సాయం

గరుగుబిల్లి: విజయవాడలోని తుఫాన్ బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించామని తోటపల్లి జట్టు సంస్థ వ్యవస్థాపకుడు డా.డి.పారినాయుడు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మహాత్మాగాంధీ స్మారక నిధి ఆధ్వర్యంలో రూ.4లక్షలు, తోటపల్లి ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సేకరించిన మొత్తం రూ.1,00,760లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడకు అందించామని చెప్పారు. ఈ మొత్తాలను విశ్రాంత పోలీస్ ఇన్‌స్పెక్టర్, జనరల్ ఆఫ్ పోలీస్ కేసీపీ గాంధీ, కార్యదర్శి రామచంద్రరావు అందించారన్నారు.

చురుగ్గా గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు

గంట్యాడ: విజయనగరం జిల్లాలో విశాఖ-రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొత్తవలస నుంచి మెంటాడ వరకూ సుమారు 40 కిలోమీటర్ల పనులు చేప డుతున్నారు. రోడ్డు పనులు కొంత వరకు పూర్తయినా, మొక్కలు నాటడం తదితర చిన్న చిన్న పనులు చేయాల్సి ఉంది. కొర్లాం వద్ద ఇంటర్ చెంజ్ పనులు సాగుతున్నాయి. ఈ హైవే నిర్మాణం వల్ల విజయనగరం, ఎస్.కోట నుంచి వచ్చే వాహనాలు నేరుగా జాతీయరహదారి పై వెళ్లడానికి అవకాశం లేదు. ప్రధాన రహదారికి అనుసంధానం చేస్తూ ఏర్పాటు చేసిన రహదారి గుండా వెళ్లాలి. అలాగే రామవరం నుంచి చిలకలగెడ్డ వరకూ రోడ్డు కూడా విస్తరించారు. విశాఖ నుంచి రాయపూర్ వరకూ ఆరులైన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి కేంద్రరోడ్డు రవాణాశాఖ నిధులు మంజూరుచేసిన విషయం విదితమే.


కొర్లాం వద్ద పూర్తి కావస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే

10న సామాజిక తనిఖీ బహిరంగ విచారణ

జియ్యమ్మవలస: మండలంలోని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గత ఏడాది జరిగిన పనులపై ఈనెల 10న సామాజిక తనిఖీ బహిరంగ విచారణ చేస్తారని ఎస్ఆర్‌పీలు బి.దాసు, ఎస్.మాధవరావు తెలిపారు. వారు ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 మధ్య కాలంలో 2,629 పనులు చేశారని చెప్పారు. దీనికి వేతనాల రూపంలో రూ.22కోట్ల 25లక్షల 67వేల 601, మెటీరియల్ రూపంలో రూ.8కోట్ల 36లక్షల 31వేల175లు కలిపి మొత్తం రూ.30కోట్ల 61లక్షల 98వేల 776 ఖర్చు చేశారన్నారు. దీనిపై ఈనెల 1 నుంచి 9వ తేదీ వరకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అవినీతిని వెలికి తీస్తున్నామన్నారు. ఈనెల 10న బహిరంగ విచారణలో నివేదిక అందజేయనున్నామని వారు చెప్పారు.

సీతంపేటలో పర్యాటకుల సందడి


అడ్వంచర్ పార్క్‌లో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

సీతంపేట రూరల్: సీతంపేట ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాలకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. ఆదలి వ్యూ పాయింట్, మెట్టుగూడ జలపాతం, ఎన్‌టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో పర్యాటకుల సందడి నెలకొంది. వీకెండ్ ఆదివారం కావడంతో ఈ వారం అధిక సంఖ్యలో చిన్నారులు, మహిళలు పర్యాటక ప్రాంతాల అందాలను చూసేందుకు ఎగబడ్డారు. పార్క్‌లో బోటింగ్, షూటింగ్, హ్యాంగింగ్ బ్రిడ్జ్ వంటి సాహసోపేతమైన క్రీడలను పర్యాటకులు ఆస్వాదించారు.

తోటపల్లిలో అన్నసమారాధన


అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. దర్శనానికి వచ్చిన భక్తులకు విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి మార్కొండ వాసుదేవరావు, పకీరునాయుడు అన్నదానం చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేలా ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ అవసరమైన చర్యలు చేపట్టారు. ఎంపీటీసీ సభ్యులు మరడాన సింహాచలంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి

గరుగుబిల్లి: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు నల్ల మధుసూదనరావు సూచించారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెలవు రోజుల్లో విద్యార్థులకు ఆట పాటలతో పాటు విజ్ఞానం అందించే పలు అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు.


గ్రంథాలయంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

క్లుప్తంగా..

గుండెపోటుతో గిరిజనుడి మృతి

సీతంపేట రూరల్: మండలంలోని మండ గ్రామానికి చెందిన సవర ధర్మారావు(45) అనే గిరిజనుడు గుండెపోటుతో మృతిచెందాడు. శనివారం మధ్యాహ్నం గ్రామం నుంచి పనిమీద పాలకొండ వెళ్లిన ధర్మారావు తిరిగి ఇంటికి చేరుకున్నాడు. ఇంటిలో నిద్రిస్తుండగా ఒక్కసారిగా ఆయాసంతో ఇబ్బంది పడ్డాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ధర్మారావును హుటాహుటిన 108 వాహనంలో సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ధర్మారావు మృతిచెందినట్లు వైద్యాధికారులు తెలిపారని మృతుడి భార్య చంద్రమ్మ తెలిపారు. మృతునికి భార్య, ఐదుగురు ఆడ పిల్లలు ఉన్నారు.

చెట్టును ఢీకొన్న లారీ

సీతానగరం: అంటిపేట గ్రామ సమీపంలో ఆదివారం వేకువజామున పార్వతీపురం నుంచి వస్తున్న తారు ట్యాంకరు లారీ అదుపు తప్పి చెట్టును ఢీకొంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. పార్వతీపురం నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న ట్యాంకర్ లారీ అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ముందు భాగం నుజ్జునుజ్జయిపోగా, డ్రైవర్ కె.రమణకు గాయాలయ్యాయి. సీతానగరం పోలీస్ సిబ్బంది స్పందించి ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

సీతానగరం: మండల కేంద్రంలో ఆదివారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్టు ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు. కేసు నమోదు చేసి, స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను తహసీల్దార్‌కు పంపిస్తున్నామని చెప్పారు.

నేడు ప్రజా ప్రతినిధులకు శిక్షణ

మక్కువ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని 21 పంచాయతీల పరిధిలోని ఉప సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు రెండు రోజుల పాటు పంచాయతీ సాధారణ పరిపాలనా విధానంపై శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీవో స్వరూపారాణి ఒక ప్రకటనలో తెలిపారు. పది అంశాలపై రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్టు అందరూ విధిగా హాజరుకావాలన్నారు.

శాంతి ఆశ్రమంలో సత్సంగం

వీరఘట్టం: పట్టణంలోని శాంతి ఆశ్రమంలో ఆదివారం సత్సంగం నిర్వహించారు. ఆధ్యాత్మిక వక్త ఎన్‌వీ రమణ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. దేహం కంటే మనస్సు గొప్పదని, మనస్సు కంటే బుద్ధి గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో నిత్య సమరనందస్వామి, కర్రి గోపన్న, అన్నపూర్ణమ్మ, చల్లమనాయుడు, గోవిందరావు, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.


ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న ఎన్వీ రమణ

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన దుర్గమ్మతల్లి
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహిళలు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని అమ్మవారి ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గమ్మతల్లి బాలత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ పూజల్లో అధికసంఖ్యలో మహిళలు, భవానీస్వాములు పాల్గొన్నారు.
(ఆంధ్రజ్యోతి బృందం)


పాలకొండ: బాలత్రిపురసుందరీదేవిగా కోటదుర్గమ్మతల్లి


సాలూరు రూరల్: లలితా త్రిపుర సుందరిగా సంతోషిమాత


సాలూరు రూరల్: సాలూరులో కరెన్సీ నోట్లతో కామాక్షి


పాలకొండ: కోటదుర్గమ్మను దర్శించుకున్న విజయనగరం జిల్లా ప్రత్యేక కోర్టు న్యాయాధికారి నాగమణి కుటుంబ సభ్యులు


పాలకొండ: కోటదుర్గమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కళా

మక్కువ: లలితాదేవి అలంకరణలో దర్శనమిస్తున్న శంబర పోలమాంబ



తిరుమల బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే కోళ్ల



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట: తిరుమలలో జరుగుతున్న బహ్మో త్సవాల్లో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆదివారం పాల్గొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు ప్రజాదర్బార్

శృంగవరపుకోట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నేడు నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని మండలవాసులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

సమాచార హక్కుచట్టంపై అవగాహన

శృంగవరపుకోట: మండల కేంద్రమైన ఎస్.కోట శాఖ గ్రంథాలయంలో ఆదివారం సమాచార హక్కు చట్టంపై జిల్లా సమన్వయ సభ్యుడు సూర్యారావు పాఠకులకు అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ శ్రీధర్ ఉన్నారు.


14 మంది కోడిపందాల రాయళ్ల అరెస్టు

బాడంగి: కోడిపందాలు ఆడుతున్న వారిని అరెస్టు చేసి కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం మండలంలోని కోడూరు గ్రామ శివారులో కోడిపందాలు ఆడుతున్న 14 మంది వ్యక్తులను అరెస్టు చేసినట్టు తెలిపారు. వారి నుంచి రూ.9వేల 200ల నగదు, 6 కోళ్లు, 11 సెల్‌ఫోన్లు, ఒక మోటారు సైకిల్ సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ దాడిలో పోలీసు సిబ్బంది పాల్గొన్నట్టు ఆయన తెలిపారు.

ముగ్గురు పేకాటరాయళ్ల అరెస్టు

దత్తిరాజేరు: మండలంలోని లింగరాజపురం శివారులో మామిడితోటలో పేకాట శిబిరంపై దాడిచేసి ముగ్గురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు స్టేషన్ బూర్జవలస ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు. ఈ మేరకు వారి వద్ద నుంచి రూ.4,200 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేసినట్లు చెప్పారు.

నేడు హజరత్ ఖాదర్‌బాబా జయంతి



ఖాదర్‌బాబా

విజయనగరం (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రం బాబామెట్ట ఖాదర్ బాబా దర్గాలో హజరత్ ఖాదర్‌బాబా జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించినట్టు దర్గా ధర్మకర్త ఖలీల్‌బాబు ఆదివా రం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరిగే జయంతి వేడుకల సందర్భంగా దర్గాలో ఖురాన్ పఠనం ప్రార్థన జరుగుతాయన్నారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, ఫకీరు మేళాలతో దర్బారు నుంచి ప్రత్యేక చాదర్, సుగంధం, పూలు, పండ్లు, స్వీట్లతో ఊరేగింపుగా వెళ్లి ఖాదర్‌బాబాకు వాటిని సమర్పించి విశ్వశాంతి కోసం ప్రార్థనలు చేస్తామన్నారు. ఖాదర్‌బాబా భక్తులు, ప్రేమికులు ఈ వేడుకల్లో పాల్గొని బాబా ఆశీర్వచనం పొందాలని కోరారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



తెర్లాం: చిన్ననాటి నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ శాఖ అధికారి సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన శిక్షణ శిబిరాల్లో భాగంగా చదవడం మాకిష్టం అనే కార్యక్రమంలో పిల్లలకు నైతిక విలువలు నేర్పించే పుస్తకాలు చదివించడం, పద్యాలు, గద్యాలు పాడించడం, ఆటలు పోటీలు, క్విజ్ పోటీలు, వ్యాస రచనలు, పురాణాలు, ఇతిహాస కథలు, గ్రంథాలయంలో చదివించామన్నారు. రిటైర్డు ఎంఈవో సత్యనారాయణ ఫిజికల్ టీచర్ విస్సు అంగన్‌వాడీ టీచర్ వైశ్రీదేవి ఉన్నారు.

వివాదాస్పద భూములపై విచారణ



విచారణ చేస్తున్న తహసీల్దార్ శ్రీను, తదితరులు

బొబ్బిలి రూరల్: డొంగురువలస పంచాయతీలోని సర్వే నెంబరు 75లోని 130 ఎకరాల వివాదాస్పద భూములపై తహసీల్దార్ ఎం.శ్రీను ఆదివారం విచారణ చేపట్టారు. 40 ఏళ్ల కిందట డొంగురువలస, పారాది, కాశిందొరవలస, తదితర గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు ఈ భూముల్లో రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చారు. పారాది ఎస్సీలు ఈ భూములను అమ్మేశారు. ఈ భూములను కొనుగోలు చేసిన వారు తమపై దౌర్జన్యాలు చేస్తున్నారని కాశిందొరవలస, డొంగురువలసకు చెందిన రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ విచారణ చేపట్టారు. భూ పట్టాలను పరిశీలించారు. తరాలుగా ఈ భూమి మీదే బతుకుతున్నామని, తమకు న్యాయం చేయాలని రైతులు మొరపెట్టుకున్నారు. రికార్డుల పరిశీలన అనంతరం రెండు వారాల్లో సమస్యను పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ విచారణలో ఆర్ఐ కల్యాణచక్రవర్తి, సర్వేయర్ సతీష్, సంతు తదితరులు ఉన్నారు.

కొనలేం.. తినలేం

- దడ పుట్టిస్తున్న కూరగాయల ధరలు
- రూ.100కి చేరిన టమాట.. ఘాటెక్కిన ఉల్లి
- వణికిస్తున్న వంటనూనెలు
- అల్లాడిపోతున్న జనం





ఇక నోరారా తినాలనుకుంటే కష్టమే.. జోబునిండా డబ్బున్నా అన్నీ కొనలేని పరిస్థితి. కూరగాయలు, వంటనూనెలు, నిత్యవసరాలు ఇలా ప్రతీదీ ధర పెరగడంతో సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు అల్లాడిపోతున్నారు. వంటింట్లో కనీస అవసరమైన ఉల్లి, టమాటా ధర సైతం అమాంతం పెరగడంతో పేదలనోట ముద్ద దిగడం లేదు.

రాజాం రూరల్/ లక్కవరపుకోట

కూరగాయల ధరలు దడ పుట్టిస్తున్నాయి.. ఈరోజు ఉన్న ధర మరుసటి రోజు ఉండడం లేదు. ప్రధానంగా ఉల్లి, టమాటా ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. రూ.500 నోటు పట్టుకుని మార్కెట్‌కి వెళ్తే కనీసం అయిదు కిలోల కూరగాయలు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదలకు పలు రాష్ట్రాల నుంచి దిగుమతి కావాల్సిన టమాటా, ఉల్లి దిగుమతులు తగ్గడంతో అమాంతం ధరలు పెరిగాయి. ఫలితంగా పేద, మధ్యతరగతి కుటుంబాలపై పెనుభారం పడుతోంది. ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో సతమతమవుతున్న సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై కూరగాయల ధరలు సైతం పెరగడంతో వారి పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా మారింది. శివమాలలు, అయ్యప్ప, భవానీ దీక్షలు ప్రారంభం కావడంతో నాన్‌వెజ్ ధరలు తగ్గుముఖం పట్టాయి. నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కావడం కూడా ధరల పెరుగుదలకు మరో కారణంగా చెప్పవచ్చు.

● కిలో టమాటా రూ.100..

ఆదివారం ఉదయం దాదాపుగా జిల్లా అంతటా కిలో టమాటా ధర రూ.100 పలికింది. గత వారం వీటి ధర రూ.60 పలికింది. కిలో ఉల్లిధర చిన్నవి రూ.60 కాగా కాస్త పెద్దవి రూ.70కి అమ్ముడైంది. గతవారం వీటి ధరలు రూ. 30 నుంచి రూ.40 వద్ద స్థిరంగా ఉన్నాయి. బల్లచిక్కుడు కాయలు కిలో రూ.130 కాగా, పొడవు చిక్కుళ్ల కిలో రూ.80 పలికింది. బీరకాయలు కిలో రూ.80 కాగా, బెండ, దొండ కాయలు కిలో రూ.60 నుంచి రూ.70 వద్ద స్థిరంగా ఉన్నాయి. రెండు అరటికాయలు రూ.30 కాగా నాటు అంగాకరకాయలు కిలో రూ.200 కాగా, హైబ్రిడ్ ధర కిలో రూ.150కి చేరింది. తాజాగా మార్కెట్లోకి వచ్చిన క్యాబేజీ చిన్నపువ్వు రూ.40 కాగా కాస్త పెద్దది రూ.50 అమ్ముడైంది. క్యాబేజీ బుట్ట కిలో రూ.70 కాగా, వంకాయలు కిలో రూ.60కి అమ్ముడయ్యా యి. కిలో బరువుండే ఆనపకాయ ధర రూ.80 కాగా చిన్న గుమ్మడికాయ ముక్క రూ.30 పలుకుతోంది. పచ్చిమిర్చి, అల్లం ధరలు కూడా సామాన్యుడ్ని అల్లాడిస్తున్నాయి.

వారం రోజుల తేడాలోనే ధరలు అమాంతం పెరడగంతో కొనుగోలుదారులు సతమతమవుతున్నారు. కూరగాయలు కొనేందుకు కొంతమంది వెనుకంజ వేస్తుండగా కిలో ట మాటా కొనేందుకు మార్కెట్‌కు వెళ్లినవారు అరకిలోతో సరిపెట్టు కుంటున్నారు. ఇకపై పండగల కాలం కావడంతో వీటి ధరలు మరింతగా పెరిగే అవకాశాలున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఉల్లి, టమాటా దిగుమతి తగ్గిందని, ఇటీవల సంభవించిన తుఫాన్‌ల ఫలితంగా కూరగాయల సాగు భారీగా దెబ్బతినడంతో ధరలు భారీ గా పెరిగాయని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు.

ఏదిఏమైనా సంక్రాంతి పర్వదినం వరకూ ధరలు పైపైకి ఎగబాకే పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఆయిల్ రేటు అమాంతం పెరిగిపోయింది. పామాయిల్ కిలో రూ.90 నుంచి 140కి పెరిగింది. రిఫండ్ ఆయిల్ లీటర్ రూ.110 నుంచి 135కు పెరిగింది. దీంతో పేదల జీవితాలు మరింత కష్టంగా మారాయి.

● కిలో రూ.50 కొన్నాం..

గత వారం కిలో టమాటా రూ.50కి, ఉల్లిపాయలు రూ.35కి కొన్నాం. ఈ ఆదివారం టమాటా రూ.100కి చేరింది. ఉల్లిపాయలు చిన్నవి రూ.60 చెబుతున్నారు. వారం రోజులో డబుల్ అయితే ఎలా.. కారణాలు ఏమైనా సరే.. పేదవాళ్ల కూరగాయలు కొనలేని పరిస్థితి.

-లక్ష్మి, గృహిణి, రాజాం



రిజర్వాయర్ స్థలంలో చేపడుతున్న గోడ నిర్మాణం



రిజర్వాయర్ స్థలంలో గేట్లు ఏర్పాటు

'తాటిపూడి' భూముల్లో నిర్మాణాలు

- కోట్లు విలువ చేసే స్థలాలు కబ్జా
- ఇరిగేషన్ కార్యాలయం పక్కనే ఆక్రమణలు

శృంగవరపుకోట రూరల్: మండలంలోని తాటిపూడి జలాశయానికి చెందిన భూములు ఆక్రమణలకు గురవుతున్నా సంబంధిత అధికారులు చూస్తూ ఊరుకోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. ముషిడిపల్లి పంచాయతీలోని తాటిపూడి రిజర్వాయర్ స్థలంలో గత వైసీపీ ప్రభుత్వంలో కోట్లు విలువచేసే ఈ భూములపై చిన్న..పెద్ద అనే తేడా లేకుండా పలువురు ఆక్రమణలు చేయడం మొదలుపెట్టారు. కొందరు ఇళ్లు కట్టేస్తుండగా.. మరికొందరు తమ భూములకు ప్రహరీలు, గేట్లు, ఇంకొందరు పంటలు వేసి సాగుచేస్తున్నారు. ఇన్ని జరుగుతున్నా వీటిని అరికట్టాల్సిన సంబంధిత శాఖ కళ్లు మూసుకుని తిరుగుతుందా అనే ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఈ శాఖ కార్యాలయాన్ని ఆనుకునే ఆక్రమణలు చోటుచేసుకుంటున్నా ఇరిగేషన్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కాని పరిస్థితి. గత ప్రభుత్వంలోని పెద్దల పేర్లు చెప్పుకుని కోట్లు విలువజేసే ఈ భూముల్లో ఆక్రమణల పర్వం మొదలైంది. వైసీపీ అండతో చెలరేగిపోయిన వారిని ఈ కూటమి ప్రభుత్వం నియంత్రిస్తుందని ఆశించినప్పటికీ ఈ నిర్మాణాలు, ఆక్రమణలు ఆగకపోవడం విశేషం. అంతేకాక తాటిపూడి జలాశయానికి చెందిన క్వార్టర్లు, భూమి, కరెంటు వంటివి ఆక్రమణదారులకు పంట పండిస్తున్నాయి. వీటిని ఉన్నతాధికారులైనా కాపాడాలని పలువురు కోరుతున్నారు. ఈ ఆక్రమణల విషయంపై జేఈ తమ్మినాయుడును వివరణ కోరగా వీటిపై విచారణ చేస్తామని తెలిపారు.

బాలికపై అత్యాచారం

- వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

భామిని: మనవరాలి వయసున్న బాలికపై ఓ వృద్ధుడు అఘాయిత్యానికి పా ల్పడ్డాడు. సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించాడు. అభం శుభం తెలి యని తొమ్మిదేళ్ల చిన్నారిపై అత్యాచారం చేశాడు. ఈ ఘటన ఆదివారం భామిని మండలంలో చోటుచేసుకుంది. బత్తిలి ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్ర కారం.. మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక తల్లిదండ్రులు వలసబాట పట్టా రు. దీంతో నాన్నమ్మ వద్దే ఉంటూ నాలుగో తరగతి చదువుతుంది. శనివారం మ ధ్యాహ్నం మెడలో తాడు తయారుచేయడానికి వారిద్దరూ కలిసి కె.చిన్నారావు(69) అనే వృద్ధుడి ఇంటికి వెళ్లారు. బాలికను అక్కడే ఉంచి.. నాన్నమ్మ వేరే పనిమీద బ యటకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన చిన్నారావు బాలికపై అత్యాచారం చేశా డు. ఏడుచుకుంటూ ఇంటికి వెళ్లిన బాలిక జరిగిన విషయాన్ని నాన్నమ్మకు చె ప్పింది. వెంటనే వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ అనిల్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలికను వైద్య పరీక్షలకు తరలించారు. చిన్నారావును అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేశారు.

చెరువులో పడి యువకుడి మృతి

వంగర: అరసాడ గ్రామానికి చెందిన సుకాది శంకర్(29) అనే యువకుడు శనివారం రాత్రి చెరువులో పడి మృతి చెందాడు. శంకర్ బహిర్భూమి కోసం గ్రామ సమీపంలో ఉన్న చెరువు వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి గౌరమ్మతో పాటు గ్రామస్థులు చుట్టుపక్కలా వెతికారు. అయినా ఆచూకీ లభ్యంకాలేదు. ఆదివారం ఉదయం చెరువులో శంకర్ మృతదేహం తేలడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ షేక్ శంకర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీయించి రాజాం సీహెచ్‌సీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్సపొందుతూ ఒకరి...

దత్తిరాజేరు: విశాఖ కేజీహెచ్‌లో చికిత్సపొందుతూ ఒకరి ఆదివారం మృతి చెందారు. స్టేషన్ బూర్జవలస ఎస్ఐ జి.రాజేష్ కథనం మేరకు.. మండలంలోని చౌ దంతివలస గ్రామానికి చెందిన ఈదుబిల్లి భాస్కరరావు (48) మద్యానికి బానిస య్యాడు. ఈనేపథ్యంలో ఆరోగ్యం క్షీణించడంతోపాటు కడుపులో నొప్పి తాళలేక శని వారం పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలిం చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. భాస్కరరావు తండ్రి సత్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

16.5 టన్నుల పీడీఎస్ బియ్యం స్వాధీనం

బొండపల్లి: మండలంలోని గరుడబిల్లి జంక్షన్ సమీపంలో వీరాగౌరీశంకర్ స్టోన్ క్రషర్‌లో అక్రమంగా నిల్వచేసిన పీడీఎస్ బియ్యాన్ని బొండపల్లి ఇన్‌చార్జి ఎస్ ఐ కె.లక్ష్మణరావు దాడిచేసి ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. గజపతినగరం మం డలంలోని బూడిపేట గ్రామానికి చెందిన పొట్నూరు అప్పలనాయుడు 330 బ స్తాలు(16.5 టన్నుల) పౌరసరఫరాల శాఖ పంపిణీ చేసిన బియ్యాన్ని నిల్వచేశాడ న్న సమాచారంతో దాడిచేసి పట్టుకున్నట్లు లక్ష్మణరావు తెలిపారు. ఈ బియ్యాన్ని సీఎస్‌డీటీ తిరుపతిరావుకు స్వాధీనపరచి నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

కూమార్తె కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదు

సంతకవిటి: తన కుమార్తె కనిపించడం లేదని మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి ఆదివారం సంతకవిటి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుమార్తె శనివారం ఉదయం కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. బంధుమిత్రులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేదని ఫిర్యాదులో స్పష్టం చేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై ఆర్. గోపాలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రెండు ట్రాక్టర్లు స్వాధీనం

పూసపాటిరేగ: మండలంలోని పాతకొప్పెర్ల వద్ద చంపావతినది నుంచి ఇసుక తరలిస్తుండగా రెండు ట్రాక్టర్లను ఆదివారం ఎస్ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. పాతకొప్పెర్లకు చెందిన కొందరు అక్రమంగా ఇసుకను తరలిస్తుండడంతో పోలీసులు ట్రాక్టర్లు సీజ్‌చేసి కేసులు నమోదుచేశారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్ఐ తెలిపారు.

డిప్యూటీ సీఎంని కదిలించిన వీడియో

- శాసనపల్లి గ్రామ సమస్యను 'ఎక్స్'లో పోస్టు చేసిన యువకుడు
- పరిష్కారానికి హామీ ఇచ్చిన పవన్‌కల్యాణ్



పిల్లలను ఎత్తుకొని నీటిలో నడుచుకుంటూ పాఠశాలకు తీసుకెళ్తున్న దృశ్యం(ఫైల్)



'ఎక్స్'లో పవన్‌కల్యాణ్ స్పందన

జామి: ఓ యువకుడు తమ గ్రామ సమస్యను వీడియో తీశాడు. దీన్ని ఆయన స్నేహితుడు తన ఎక్స్(ట్విట్టర్) ఖాతాలో పోస్టు చేసి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ట్యాగ్ చేశాడు. ఈ వీడియో పవన్‌ను కదిలించింది. వెంటనే ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. దీంతో ఆ గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేయడంతో ఆ యువకులను అభినందిస్తున్నారు. గజపతి నగరం నియోజకవర్గం జామి మండలంలో శాసనపల్లి గ్రామం ఉంది. ఈ గ్రామస్థులకు రెండు కిలోమీటర్ల దూరంలోని గంట్యాడ మండలం పెదవేమలితో ఎక్కువగా సంబంధాలు ఉన్నాయి. ప్రతి చిన్న అవసరానికి పెదవేమలి వెళ్తుంటారు. చదువులు, నిత్యావసరాలు, వైద్యం ఇలా అన్నింటికి ఆ గ్రామం వెళ్లాల్సిందే. అయితే, భారీ వర్షాలు కురిసే సమయంలో శాసనపల్లికి ఆనుకొని ఉన్న గెడ్డ పొంగిపొర్లుతుంది. ఈ సమయంలో బాహ్య ప్రపంచంతో గ్రామస్థులకు సంబంధాలు తెగిపోతాయి. ముఖ్యంగా ఈ గ్రామం నుంచి పెదవేమలి వెళ్లే దారిలో 200మీటర్ల మేర పెద్దఎత్తున నీరు ప్రవహిస్తుంటుంది. ఈ సమయంలో గ్రామం నుంచి ఎవరూ బయటకు రాలేరు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు సెలవు పెట్టాల్సిందే. అదే విదంగా భీమసింగి వైపు రావాలన్న గెడ్డ నీరు ఉంటుంది. దశాబ్దాలుగా వేదిస్తున్న ఈ సమస్యను పరిష్కరించాలని, గెడ్డకు రెండు వైపులా చిన్నపాటి వంతెనలు నిర్మించాలని ఎందరో నాయకులు, అధికారులకు గ్రామస్థులు విన్నవించినా ఫలితం శూన్యం. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన బసవ కిశోర్ అనే యువకుడు గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను వీడియో తీశాడు. దీన్ని అతని స్నేహితుడు ఆకిరి జశ్వంత్ శనివారం రాత్రి 'ఎక్స్'లో పోస్ట్ చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు ట్యాగ్ చేశాడు. పోస్ట్ చేసిన గంట వ్యవధిలో పవన్‌కల్యాణ్ ఎక్స్ వేదిక ద్వారా స్పందించారు. 'మీ సమస్య నన్ను కదిలించింది. దీన్ని జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తాను. కొంచెం సమయం ఇవ్వండి. మీ గ్రామ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తా'మని పోస్టు చేశారు. సమస్య పరిష్కారానికి సాక్షాత్తు డిప్యూటీ సీఎం నుంచే హామీ రావడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వీడియోను పోస్టు చేసిన యువకులను అభినందించారు.

చెట్టు కొమ్మలు నరికి పోల్ నిర్మాణం



ఆర్టీఏ కార్యాలయం దగ్గరలోని, దుకాణం ఎదురుగా ఉన్న చెట్టును నరికి వేస్తున్న దృశ్యాలు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీఏ కార్యాలయానికి సమీపంలో ఓ క్రాకర్స్ వ్యాపారి తన బిల్డింగ్‌కు అడ్డుగా ఉందని పలువురికి నీడనిచ్చే పచ్చటి చెట్టుకొమ్మలను నరికివేయించాడు. ప్రభుత్వం ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి పెంచిన చెట్టు కొమ్మలను తొలగించాడు. జాతీయ రహదారి 23కు అనుకుని ఉన్న ప్రభుత్వం స్థలంలో తన వ్యాపారానికి అనుగుణంగా ప్రకటనలు ఏర్పాటు చేసుకునేందుకు ఇటీవల పోల్స్ ఏర్పాటుచేసుకున్నాడు. ఇందేటని ప్రశ్నిస్తే.. తన పనివారితో దుర్భాషలాడుతూ, గొడవకు దిగుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా నగరపాలక సంస్థ, రెవెన్యూ, ఎన్.హెచ్ అధిఇకారులు పట్టించుకోక పోవటంపై స్థానికులు విమర్శిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వ్యాపారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రాజాంలో లక్ష బిల్వార్చన



రాజాం రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాలు, నవదుర్గ మండలదీక్ష కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఓ ప్రయివేటు జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం దుర్గాదేవికి లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రధాన అర్చకులు రాజు సారథ్యంలో గురుభవానీలు బెహరా తౌడు, నంది సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కుంకుమార్చనలో పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు, సంఘసేవకులకు ప్రత్యేక గుర్తింపు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి, అక్టోబరు 6: ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలక మైనదని, సమాజంలో రుగ్మతలను పారదోలడానికి సామాజిక కార్యకర్తల బాధ్యత బృహత్తరమైనదని బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక అభిమాని ఫౌండేషన్ కార్యాలయంలో ఆదివారం జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలకు సేవాశ్రీ ఎక్స లెన్సీ అవార్డుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ రెడ్డి రాజగోపాలనాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి ఫలితంగానే ఎంతో మంది ఉన్నతమైన స్థానాలను అధిరోహించగలుగుతున్నారన్నారు. ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ కేవీ అప్పారావు మాట్లాడుతూ ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొంటూనే అభిమాని సంస్థ విస్తృతమైన సేవలందించగలుగుతోందన్నారు. సీఐ కటకం సతీష్‌కుమార్, రోటరీక్లబ్ ప్రతినిధి, కారుణ్యఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు, రాజగోపాలనాయుడు మాట్లాడారు. ప్రభుత్వ పరంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలైన గవిరిశెట్టి వెంకటరావు, యజ్జల మహేశ్, అనపర్తి పద్మావతి, ఎస్‌వీ రమణమూర్తి (గ్రీన్‌బెల్ట్ సొసైటీ), మింది విజయమోహన్(కళాసంస్థలు), గుంట్రెడ్డి భాస్కరరావు(కార్టూనిస్టు), బంకురు ప్రసాద్ (త్రైక్వాండో కోచ్), లంక వాసుదేవరావు(నేను సైతం), ముంతల చిన్నారావు, చింతాడ శ్రీదేవిలను ఘనంగా సన్మానించి సేవా శ్రీ ఎక్సలెన్సీ అవార్డులను అందజేశారు. యోగా టీచర్ కోరాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.